సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ¦ 6 ¦ అక్టోబర్ ¦ 2023



ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించాలి

వేమనపల్లి: పారిశుధ్య ట్రాక్టర్ల కిస్తీలు, విద్యుత్ చార్జీలు చెల్లించాలని డీపీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కేతన్‌పల్లి, నీల్వాయి, నాగారాం, రాజారాం, కల్లెంపల్లి పంచాయతీలను సందర్శించారు.



ముగిసిన క్రీడా పోటీలు

లక్సెట్టిపేట: స్థానిక గురుకుల కళాశాలలో మూడు రోజులుగా సాగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిసాయి. ఆర్‌సీవో గోపిచంద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీసీవో శ్రీధర్, ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి, ఏటీపీ సునీత పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హాజీపూర్ ఠాణాను సందర్శించిన డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం సందర్శించారు. అంతకుముందు దొనబండ, కర్ణమామిడి గ్రామాల్లో పర్యటించి బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు. 7న శనివారం మంత్రి హరీశ్‌రావు పర్యటనలో భాగంగా కర్ణమామిడి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో బందోబస్తు చర్యలపై సమీక్షించారు. అనంతరం హాజీపూర్ పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. నేరాలకు సంబంధించి వివరాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, రూరల్ సీఐ సంజీ వ్, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

16న లాభాల వాటా చెల్లింపు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఈ నెల 16న లాభాల వాటా డబ్బులు పంపిణీ చేయనున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం సంస్థ రూ.2222.46 కోట్ల లాభాలను ఆర్జించింది. కార్మికులకు 32 శాతం వాటా పంచుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ కొద్ది రోజుల క్రితం ప్రకటించిన మేరకు బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయి. మస్టర్లు, ఇన్సెంటివ్ ప్రాతిపదికన వాటా డబ్బులు పంపిణీ అవుతాయి. 85శాతం మస్టర్లు, 1శాతం వ్యక్తిగత పర్ఫార్మెన్స్, 14శాతం గ్రూప్ పర్ఫార్మెన్స్ ఆధారంగా చెల్లిస్తారు. భూగర్భ గనుల్లో మస్టర్‌కు రూ.662.14, సీహెచ్‌పీ/సీఎస్పీలలో రూ. 524.31, డిపార్టుమెంట్లలో పనిచేసే వారికి మస్టర్‌కు రూ.484.31, ఇన్సెంటివ్ ఇతర గ్రూప్ పర్ఫార్మెన్స్ ఆధారంగా వాటా డబ్బులు చెల్లిస్తామని సింగరేణి కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది.

డీటీడీవోగా గంగారాం



మడావి గంగారాం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గిరిజన అభివృద్ధి సంక్షేమ అధికారి(డీటీడీవో)గా మడావి గంగారాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంచార్జి డీటీడీవోగా పనిచేస్తున్న నీలిమ తన ఏటీడీవో స్థానంలోకి వెళ్లనుండగా, కరీంనగర్‌లో పనిచేస్తున్న గంగారాం డీటీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

కలెక్టరేట్ ముట్టడించిన ఆశా కార్యకర్తలు



ముట్టడిలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని ఆశా యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు గురువారం కలెక్టరేట్ ముట్టడించారు. అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ మాట్లాడుతూ గత 11 రోజులు సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. పారితోషికం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశయ్య, పుష్ప, భాగ్య, లీలావతి, విజయలక్ష్మి, స్రవంతిరాణి, కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ప్రకాష్, సీపీఎం జిల్లా కార్యదర్శి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.చందు, నాయకులు పాల్గొన్నారు.

ఐఆర్‌పై పెన్షనర్ల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన పెన్షనర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం 5శాతం ఐఆర్(మధ్యంతర భృతి) ప్రకటించడంపై గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కే.ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ కమిటీని స్వాగతిస్తున్నామని, మధ్యంతర భృతి 5శాతం మాత్రమే ప్రకటించడం అన్యాయమని అన్నారు. 15శాతం మధ్యంతర భృతి చెల్లించి గత జూలై నుంచి అమలు చేయాలని, బకాయిలు ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, ఎస్.వెంకటస్వామి, శంకరయ్య, కేఎంఎస్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు బిజీ బిజీ !

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందడి
- కొబ్బరికాయలు కొడుతూ.. శిలాఫలకాల ఆవిష్కరిస్తూ..
- అసెంబ్లీ ఎన్నికల వేళ అభివృద్ధి పనుల వేగం



చెన్నూర్‌లో క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న విప్ సుమన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల గడువు తరుముతున్న వేళ అధికార పార్టీ ఎమ్మెల్యేలు బిజీ బిజీగా గడిపేస్తున్నారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు వేగం పెంచుతూ.. పెండింగ్ పనులపై దృష్టి సారిస్తున్నారు. ఇక ప్రతీ రోజు ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. అక్కడే సభలు, సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గ ప్రజలతో మమేకం అవుతున్నారు. జిల్లాలో ప్రధాన నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లో ఉరుకులు, పరుగులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బతుకమ్మ చీరలు, క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఇక ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని జన్నారంలో కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారు. మండలంలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేకు మళ్లీ టికెట్ దక్కకపోవడంతో జిల్లాలో మిగతా చోట్ల ఉన్న పరిస్థితి లేదు. తమకు బలం ఉన్న ప్రాంతాలతోపాటు గత ఎన్నికల్లో ఓట్లు తక్కువగా వచ్చిన చోట ఇప్పటివరకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల సీఎం బల్దియాలు, పంచాయతీలకు ప్రకటించిన ప్రత్యేక, ఇతర నిధులతో పనులు ప్రారంభిస్తున్నారు. గత నెల రోజుల్లోనే రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి.

చెన్నూరులో వేగంగా..

జిల్లాలో మిగతా రెండు నియోజకవర్గాలతో పోలిస్తే చెన్నూరులో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వేగంగా సాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో ఇటీవల మంత్రి కేటీఆర్‌తో సుమారు రూ.312కోట్ల అభివృద్ధి పనుల కార్యక్రమాలు జరిగాయి. ఎన్నికలకు ముందే రెవెన్యూ డివిజన్, రెండు మండలాల ఏర్పాటుకు ఆమోదం లభించింది. త్వరలోనే మంత్రి హరీశ్‌రావుతో చెన్నూరు పట్టణంలో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి చెన్నూర్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు. రోడ్లు, భవనాలు, పాత పనులను వేగవంతం చేయించడం, బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లు, ఉచిత చేప పిల్లల పంపిణీ తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటున్నారు.

ప్రజల్లోనే 'నడిపెల్లి'..

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జిల్లా కేంద్రంతోపాటు తన నియోజకవర్గంలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పొద్దు పోయే వరకు మస్తు బిజీగా గడిపేస్తున్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తున్నారు. సీసీ రోడ్లు, భవన నిర్మాణాలు, కల్వర్టులు, జిల్లా కేంద్రంలో సుందరీకరణ పనులు, రోడ్లు, వీధి దీపాలు, మురికి కాలువలు, బతుకమ్మ చీరలు, క్రీడా కిట్ల పంపిణీ, స్పెషల్ డెవలప్‌మెంట్ కింద వచ్చిన నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులపై దృష్టి పెడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి నిత్యం ప్రజల్లోనే గడిపేస్తున్నారు. రెండు రోజుల్లో మంత్రి హరీశ్‌రావుతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక వేస్తున్నారు.



హాజీపూర్ మండలం రాపల్లిలో రూ.10లక్షలతో డ్వాక్రా మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ

బెల్లంపల్లిలో జోరుగా..

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సైతం నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. బెల్లంపల్లి పట్టణంతోపాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులపై దృష్టి పెట్టారు. ప్రతీరోజు శంకుస్థాపనలు, పూర్తయిన చోట ప్రారంభోత్సవాలతో గడిపేస్తున్నారు.



రూ.18లక్షలతో సోమగూడెంలో మహిళా సమాఖ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

క్రీడారంగ అభివృద్ధికి పెద్దపీట

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ సుమన్

చెన్నూర్: రాష్ట్రంలో క్రీడారంగాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం చెన్నూర్‌కు వచ్చిన విప్‌కు మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్రీడాకారులకు 178 క్రీడా కిట్లు, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల మహిళలకు 83,626 బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం కనబర్చేందుకు క్రీడా సామగ్రి ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతుకమ్మ పండుగను సంతోషంగా నిర్వహించుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ కానుకలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, శాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ పోస్టు)ను పొరుగు సేవల పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్/తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు ద్వారా సినిమాటోగ్రఫీలో డిప్లొమా తత్సమాన అర్హత కలిగిన వారు వీడియోగ్రాఫర్‌కు, 10వ తరగతి విద్యార్హత కలిగి, ఏదైనా వరపత్రి కలిగిన ఫొటోస్టూడియోలో ఐదేళ్ల అనుభవం ఉన్నవారు ఫొటోగ్రాఫర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలు సమీకృత జిల్లా కలెక్టరేట్ జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 6న సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మంచిర్యాలకు క్రిటికల్ కేర్



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

- అందనున్న అత్యవసర వైద్యం
- ప్రభుత్వాస్పత్రి పరిధిలో ఏర్పాటు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో ఇక అత్యవసర వైద్యం అందుబాటులోకి రానుంది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు, ఆత్మహత్యాయత్నాలు వంటి ఘటనల్లో ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో జాప్యం జరుగుతుంది. జాప్యాన్ని నివారించి వెంటనే మెరుగైన వైద్యం అందించేందుకు క్రిటికల్ కేర్ ఉపయోగపడనుంది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద మంచిర్యాల జిల్లాకు క్రిటికల్ కేర్ మంజూరైంది. ఈ మేరకు నిజామాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సభలో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో క్రిటికల్ కేర్‌లను ఏర్పాటు చేస్తున్న ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు. ఇందులో మంచిర్యాల జిల్లా కూడా ఉండగా.. త్వరలోనే మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు కాగా, రెండో సంవత్సరం విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతున్నారు. కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్వహిస్తుండగా.. మాతాశిశు ఆరోగ్య కేంద్రం కూడా దీని పరిధిలోనే నిర్వహిస్తున్నారు. ప్రసవాలు, చిన్నారుల ఆరోగ్యం, జనరల్ ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందిస్తున్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగానే క్రిటికల్ కేర్‌ను సైతం నిర్వహించాల్సి ఉంటుంది. విధి విధానాలపై ఇక్కడి వైద్యులకు ఎలాంటి సమాచారం అందక పోయినా, క్రిటికల్ కేర్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెబుతున్నారు. ప్రతీ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఇది పనిచేస్తుందని, ఇది పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

అత్యవసర వైద్యం అవసరం

మంచిర్యాల జిల్లా కేంద్రానికి కుమురంభీం జిల్లా, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తుంటారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, ఆత్మహత్యాయత్నాలు, ఇతరత్రా అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తుంటారు. పారిశ్రామిక ప్రాంతం కావడం, తరచూ రోడ్డు ప్రమాదాలు, ఏదో ఒకచోట గ్రూపు తగాదాలు వంటివి చోటు చేసుకుంటుండడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి అత్యవసరంగా వస్తుంటారు. ఆస్పత్రిలో ఐదు పడకలతో కూడిన ఐసీయూ మాత్రమే ఉండడం, కొన్నింటికి మాత్రమే వైద్యం అందిస్తుండడంతో కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు రెఫర్ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు తరలించేలోపు కొందరు మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విషం, పురుగుల మందు తాగిన వారికి కొంతవరకు చికిత్స అందిస్తున్నా, వీరిలోనూ క్రిటికల్‌గా ఉన్న వారిని ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గుండెపోటు వచ్చిన వారిని నేరుగా కరీంనగర్‌కే తరలించాల్సి వస్తోంది. ఇక రాత్రి సమయాల్లో జరిగే రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్యం మంచిర్యాలలో అందడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రాత్రి సమయంలో వైద్యులు అందుబాటులో లేక, తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు మెరుగైన వైద్యం కోసం వెళ్లాల్సి వస్తోంది.

పేదలకు వరం

క్రిటికల్ కేర్ ఏర్పాటు వల్ల అన్ని రకాల వైద్య సేవలు, వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. దీని కోసం దాదాపుగా రూ.25 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించగా, క్రిటికల్ కేర్ నిర్మాణం, వంద పడకల ఐసీయూతోపాటు ఆక్సిజన్, వెంటిలేటర్లు, అన్ని విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఉచితంగా వైద్యం అందించడం వల్ల పేదలకు అత్యాధునిక వైద్యం అత్యవసర సమయాల్లో అందుబాటులోకి వస్తుంది. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన బాధ తప్పనుంది.

మెరుగైన వైద్యం



మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఉన్న ఐసీయూలో సరిపడా బెడ్‌లు లేక ఇబ్బందిగా ఉంటుంది. క్రిటికల్ కేర్ ఏర్పాటుతో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతోపాటు అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన వైద్యం అందించడం జరుగుతుంది. క్రిటికల్ కేర్ ఏర్పాటుతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిపై కొంత భారం కూడా తగ్గుతుంది.

– డాక్టర్ హరీశ్ చందర్‌రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

నేటి నుంచి విద్యార్థులకు 'బ్రేక్‌ఫాస్ట్'



అల్పాహారం ప్రారంభించే న్యూ గర్మిళ్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడిలో విద్యార్థులకు అల్పాహారం పథకం శుక్రవారం లాంఛనంగా ప్రారంభం కానుంది. జిల్లాలో నియోజకవర్గానికో పాఠశాలలో పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. మంచిర్యాల నియోజకవర్గంలో న్యూగర్మిళ్ల పాఠశాల, చెన్నూర్ నియోజకవర్గంలో మందమర్రి ఫిల్టర్‌బెడ్ ఎంపీపీఎస్, బెల్లంపల్లి నియోజకవర్గంలో బెల్లంపల్లి 2ఇంక్‌లైన్ ఎంపీపీఎస్‌ల్లో పథకాన్ని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, ప్రభుత్వ విప్ సుమన్, దుర్గం చిన్నయ్య ప్రారంభిస్తారు. పాఠశాల సమయానికి కంటే 45 నిమిషాల ముందు అల్పాహారం అందిస్తారు. పిల్లలో పోషకాహార లోపం నివారించడం, తరగతి గదిలో హాజరు నమోదు పెంచడానికి ప్రభుత్వం అల్పాహార పథకాన్ని అమలు చేస్తోంది.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఎప్పుడో..?

డ్రాపౌట్స్ నివారణతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు నిర్ణయించనట్లు 2020 జూలై 18న కేసీఆర్ ప్రకటించారు. మూడేళ్లయినా పథకం అమలుకు నోచుకోక విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 10 ప్రభుత్వ కళాశాలల్లో 3,600 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కళాశాలకు ఉదయం 8గంటలకు బయలుదేరితే ఇంటికి వెళ్లేసరికి రాత్రి 8గంటలు దాటుతుందని తెలుస్తోంది. కళాశాలలో చదివే విద్యార్థులందరూ పేదలు కావడంతో ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండానే కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో అర్ధాకలితో పాఠాలు అర్థంకాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ప్రభుత్వం కనీసం కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

మెనూ ఇలా..

సోమవారం : ఇడ్లీ, సాంబారు లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
మంగళవారం : పూరి, ఆలుకూర్మా లేదా టోమాటో బాత్, సాంబార్
బుధవారం : ఉప్మా, సాంబారు లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ
గురువారం : చిరుధాన్యాల ఇడ్లీ, సాంబారు లేదా పొంగల్, సాంబారు
శుక్రవారం : ఉగ్గని, అటుకులు, చిరుధాన్యాల ఇడ్లీ, చట్నీ, లేదా బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ
శనివారం : పొంగల్, సాంబారు లేదా కూరగాయల పులావ్, పెరుగు చట్నీ, ఆలుకుర్మా

రేపు మంత్రి హరీశ్‌రావు రాక

- 50 పడకల ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న విప్ సుమన్

చెన్నూర్: చెన్నూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం రానున్నారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉదయం 11:30 గంటలకు రూ.10 కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రూ.55 కోట్లతో రోడ్లు, దోబీఘాట్ పనులు ప్రారంభించిన అనంతరం రోడ్డు షోలో పాల్గొంటారని పేర్కొన్నారు. పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి మాట్లాడుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ప్రజాప్రతినిధుల, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో శనివారం మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నారు. గుడిపేట బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి నేరుగా దొనబండ గ్రామ శివారులో పద్దనపల్లి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత చెన్నూర్‌కు హెలికాప్టర్‌లో బయల్దేరివెళ్తారు.

ఐఆర్‌పై డీటీఎఫ్ నిరసన ప్రదర్శన



నిరసనలో డీటీఎఫ్ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర భృతి(ఐఆర్) 5శాతం ప్రకటించడంపై డీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, జయకృష్ణ, ప్రకాష్, శ్రీనివాస్, శంకర్, సాయిబాబు, శిల్ప, కళ్యాణి, కవిత మౌనిక, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. సీఐటియూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రకాష్, 104 ఉద్యోగులు శ్రీనివాస్, రమేష్, నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, అశోక్, చందు, గుమస అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: భర్త, అత్తమామ వేధింపులు తాళలేక జిల్లా కేంద్రానికి చెందిన మహిళా హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... రాళ్లపేటకు చెందిన సయ్యద్‌గులామ్‌-నసీమా సుల్తానా చిన్న కూతురు రేష్మబేగం(30) హైదరాబాద్‌కు చెందిన అలీమ్ అక్తర్ అలీ హుస్సెన్‌తో పదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. కొంత కాలంగా రేష్మ భర్తతో పాటు అత్త శౌకత్‌బాను, మామ మీర్‌సాభీర్, ఆడపడుచులు ఫర్వీ, మరిది తాహేర్ అలీహాశ్మ అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టారు. అలాగే రేష్మ మీద అనుమానంతో గుండు గీయించారు. దీంతో తీవ్రంగా కృంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు


శ్రీకాంత్ (ఫైల్)

తాండూర్: మండలంలోని కాసిపేట పంచాయతీ పరిదిలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు తాగూర్ శ్రీకాంత్ తప్పిపోయినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. యువకుడు మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రం బాపురావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... ఆత్రం బాపు గ్రామంలోని ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. దీంతో కాలు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

దండేపల్లి: మండలంలోని ద్వారకలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, దండేపల్లి పోలీసులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓ ఇంట్లో నిల్వ చేసిన రూ.20వేల 18 టేకు దుంగలు, మరో ఇంట్లో మూడు లీటర్ల నాటు సారాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం పట్టుకున్న కలపను అటవీశాఖ అధికారులకు, గుడుంబాను దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాండూర్: జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో రేచిని విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం మండలంలోని రేచిని గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో నిర్వహించిన ఖోఖో ఎంపిక పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా పరిధిలోని 16బాలుర, 8 బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో రేచిని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానంలో జైపూర్ టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు నిలిచారు. బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ రేచిని ప్రథమ స్థానం, నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు ఇచ్చారు.

కష్టపడ్డారు.. కొలువు సాధించారు..!

- కానిస్టేబుల్ ఉద్యోగాలకు పలువురు ఎంపిక

మంచిర్యాలక్రైం: ఒంటిపై ఖాకీ చొక్కా.. చేతిలో లాఠీ.. సమాజంలో గుర్తింపు.. అక్రమార్కుల గుండెల్లో సింహస్వప్నం.. ఇదీ మన పోలీసుల దర్జా. ఈ ఉద్యోగం కోసం యువతి, యువకులు పరితపించారు. ఎంతో కష్టపడ్డారు. కొలువు సాధించారు. బుధవారం వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో పలువురు ఉద్యోగం సాధించారు. మంచిర్యాలలోని ఏకలవ్య ఆశ్రమంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందిన వారిలో 15మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మండలం నుంచి 13మంది..

దహెగాం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13మంది కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. ఒకే దఫాలో అధిక సంఖ్యలో ఎంపిక కావడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన బుద్దె సాగర్ సీఐఎఫ్‌ఎఫ్ బెటాలియన్‌లో జవానుగా పని చేస్తూ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు.
- రాంగూర్ గ్రామానికి చెందిన కాటెల భీమేష్, బ్రహ్మణ్‌చిచ్యాల గ్రామానికి చెందిన దందెర రాజశేఖర్, ఏఆర్ కానిస్టేబుళ్లుగా, ఇట్యాల గ్రామానికి చెందిన ముత్తినేని శివకుమార్ ఫైర్ కానిస్టేబుల్‌గా, గొర్రె తిరుపతి టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా, పెసరికుంట గ్రామానికి చెందిన నాయికిని సాయిలత, గిరవెల్లి గ్రామానికి చెందిన రౌతు సాగర్ సివిల్ కానిస్టేబుళ్లుగా, పీపీ రావు కాలనీకి చెందిన కోండ్ర శివ ఏఆర్ కానిస్టేబుల్, కల్వాడకు చెందిన కొండ్ర సాయి, ప్రియాంక, ఇట్యాల గ్రామానికి చెందిన పిప్పిరి రమణి సివిల్ కానిస్టేబుళ్లుగా, లగ్గాం గ్రామానికి చెందిన గొట్ల శ్రీలత ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు.
- మండలంలోని కర్జి గ్రామానికి చెందిన తు మ్మిడె దామోదర్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా, కుంచవెల్లి గ్రామానికి చెందిన మంచికట్ల మానస ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు.

అన్నాచెల్లెలు..



దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన దాసరి పోశం, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. ఇందులో అన్నాచెల్లెలు శ్రీకాంత్, సమ్మక్క పోలీసు ఉద్యోగం సాధించారు. సమ్మక్క జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా కూడా ప్రతిభ కనబరుస్తోంది. పేద రజక కుటుంబానికి చెందిన వీరిలో సమ్మక్క సివిల్, శ్రీకాంత్ టీఎస్ఎస్‌పీలో కొలువు సాధించారు.

– దాసరి సమ్మక్క, దాసరి శ్రీకాంత్ అన్నా చెల్లె

వ్యవసాయ కుటుంబం నుంచి..



మండలంలోని కర్జి గ్రామానికి చెందిన చౌదరి హన్మంతు, మాణిక్యం దంపతులకు ముగ్గురు సంతానం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు చౌదరి మహేష్ ఆర్మీ ఉద్యోగం చేస్తున్నాడు. రెండో సంతానం చౌదరి శ్రీనివాస్ ఉన్నత చదువులు చదువుతూ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు.

– చౌదరి శ్రీను కర్జి గ్రామం

కన్నవారి కల నెరవేర్చేందుకు..



నాన్న వెంకటి, అమ్మ బానక్కకు ముగ్గురం ఆడపిల్లలం. అన్నయ్య వ్యవసాయం చేసేవారు. అమ్మకు మేము పోలీస్ ఉద్యోగం చేయాలని చాలా ఇష్టం. అమ్మానాన్నల ప్రోత్సాహంతో అక్క, నేను, అన్నయ్య ప్రయత్నం చేశాం. వారిద్దరు అర్హత సాధించలేదు. నేను అయినా తల్లిదండ్రుల కల నెరవేర్చాలని కష్టపడి చదివి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను.

– కావేర లక్ష్మి, ఏఆర్ కానిస్టేబుల్, గ్రామం: నాగంపేట, మం: కోటపలి

మూడోసారి సాధించా..



ఖాకీ కొలువంటే ఇష్టం.. ఓ పక్క పేదరికం. వ్యవసాయ కుటుంబం.. అమ్మానాన్నలు వేముల రాజం, బాలమ్మ ఎంతో కష్టపడి డిగ్రీ చదివించారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులకు వెళ్లలేక పోలీస్ ఉద్యోగం కోసం ప్రయత్నించాను. 2016, 2018లో రెండు సార్లు విఫలమయ్యాను. మూడో ప్రయత్నంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. నా భర్త వరప్రసాద్ ప్రోత్సాహం ఎంతో ఉంది.

– వేముల విష్ణుప్రియ, బెజ్జాల

ఆర్ఎస్ ప్రవీణ్ సార్ స్ఫూర్తితో..



పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి రావడం నాకు రోల్ మోడల్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు గురుకులాల్లోనే చదివాను. ఇంటర్‌లో నాన్న మరణించాడు. అమ్మ వ్యవసాయం, కూలీ పని చేస్తూ చదివించింది. అమ్మ కష్టం చూసి ఉద్యోగం సాధించాలనే కసితో మొదటి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్ అయ్యాను.

– జనగామ మల్లేశ్వరి, మం: చెన్నూర్, గ్రామం: ఎర్రగుంటపల్లి

పోలీస్ యూనిఫామంటే ఇష్టం..



పోలీస్ యూనిఫామ్ అంటే ఇష్టం. అమ్మానాన్నలు శ్రీనివాస్, శ్రీలత కల నెరవేర్చేందుకు రెండేళ్లు కష్టపడి సాధించాను. సమాజంలో మహిళలపై చిన్నచూపు ఉంది. పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపియ్యాను. నాన్న మంగలి పనిచేసి డిగ్రీలో బీఎస్సీ బయోటెక్ చదివించాడు.

– మందపెల్లి అశ్విత, మంచిర్యాల


తల్లిదండ్రులతో రమ్యశ్రీ

జన్నారం: మండలంలోని ఆరుగురు కానిస్టేబుళ్లుగా ఉద్యోగం సాధించారు. పానకల్‌కు చెందిన నగూరి కిషన్, సులోచన దంపతులు కూలీ పనులు చేస్తూ కూతురు రమ్యశ్రీని డిగ్రీ వరకు చదివించారు. ఇంట్లోనే ఉంటూ పరీక్షకు సన్నద్ధమైంది. కష్టపడి చదివి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది.

- అక్కపెల్లి గూడకు చెందిన వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్ కుమారుడు ఉదయ్‌కుమార్, జన్నారానికి చెందిన లచ్చన్న కూతురు చిటికేసి సౌమ్య సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి లక్ష్మి, లింగన్న దంపతులు వ్యవసాయ చేస్తూ కుమారుడు అజయ్‌ను చదివించారు. డిగ్రీ పూర్తి కాగానే పోలీసు ఉద్యోగం కోసం ప్రయత్నించినా ఎంపిక కాలేదు. బీఎడ్ పూర్తి చేసి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని అజయ్ పేర్కొన్నాడు.

అన్న ప్రోత్సాహంతో..

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన పాదం గట్టు స్వామి అన్న, అమ్మమ్మ ప్రోద్బలంతో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. స్వామి తల్లి రాజ్యలక్ష్మి 2009లో, తండ్రి సత్తన్న 2017లో మృతిచెందారు. స్వామితోపాటు అతడి అన్న రాకేష్‌ను అమ్మమ్మ చెరుకు దుర్గమ్మ చదివించింది. డిగ్రీ పూర్తి చేసిన స్వామి అమ్మమ్మ, అన్నయ్య ప్రోత్సాహంతో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.


నేతావత్ ప్రకాశ్


పాదం గట్టుస్వామి

ఐదోసారి ప్రయత్నంలో ఉద్యోగం

మండలం కవ్వాల్, బంగారుతండా గ్రామానికి చెందిన నేతావత్ లచ్చిరాం, కమల దంపతుల కుమారుడు ప్రకాశ్ ఇంటర్ పూర్తి చేసిన ఆర్మీలో చేరాలని రెండుసార్లు ప్రయత్నించాడు. ఎంపిక కాకున్నా.. నిరుత్సాహ పడకుండా బీట్ అధికారి ఉద్యోగానికి ప్రయత్నించాడు. ఉత్తీర్ణత సాధించినా ఏజెన్సీ సర్టిఫికెట్ లేని కారణంగా ఉద్యోగం పొందలేదు. మరోసారి కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించాడు. రెండు మార్కులతో సాధించలేకపోయాడు. ఐదోసారి టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఎస్సైగా ఉద్యోగం సాధించడమే తన ధ్యేయమని ప్రకాశ్ తెలిపాడు.

ఒకే గ్రామం.. ఎనిమిది మంది..


సాయికుమార్


రాజ్‌కుమార్

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఎనిమిది మంది ఇటీవల విడుదలైన ఫలితాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన కాంద్రపు అరుణ్, సంజీవ్ సివిల్ కానిస్టేబుళ్లుగా, మేరుగు కళ్యాణ్ ఫైర్‌మెన్, ఏఆర్ డిపార్ట్‌మెంటులో సాయికుమార్, ఇండ్ల ప్రవీణ్‌కుమార్, సురేష్ బత్తుల అజయ్, అంకతి మహేష్ టీఎస్‌పీఎస్సీకి ఎంపికయ్యారు. మండలంలోని జెండావెంటాకపూర్ గ్రామానికి చెందిన కొడిచెర్ల రాజ్‌కుమార్ సెంట్రల్ ఎస్ ఎస్‌బీ ఉద్యోగంతోపాటు టీఎస్‌పీఎస్సీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకొచ్చారు.

కానిస్టేబుళ్లుగా ముగ్గురు అన్నదమ్ములు


ఎంపికైన ముగ్గురు అన్నదమ్ములు


గొంట్లపేట్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు

పెంచికల్‌పేట్: మండలంలోని 19 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. చేడ్వాయి గ్రామానికి చెందిన సునీత, మాధవ్ దంపతుల ముగ్గురు కుమారులు రామ్(ఏఆర్), లక్ష్మణ్(టీఎస్ఎస్పీ), వెంకటేష్(టీఎస్ఎస్పీ), గొంట్లపేట్ గ్రామానికి చెందిన లక్ష్మి, రమేష్ దంపతుల ఇద్దరు కుమారులు సురేష్(ఏఆర్), శ్రావణ్(టీఎస్ఎస్పీ) కొలువులు సాధించారు. అగర్‌గూడ గ్రామానికి చెందిన దుర్గం చంద్రశేఖర్(సివిల్), రౌతు సుధాకర్(టీఎస్ఎస్పీ), ఎల్లూర్ గ్రామానికి చెందిన కుకిడే మధుకర్(ఏఆర్), కుకిడే దిలీప్(టీఎస్ఎస్పీ), పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన ముప్పిడే నరేష్(సివిల్), గాదం రాజు(టీఎస్ఎస్పీ), చిందం సాయికృష్ణ(ఏఆర్), లోడుపల్లి గ్రామానికి చెందిన పనాస సౌందర్య(సివిల్), దరోగపల్లి గ్రామానికి చెందిన సందకర్ జ్యోతి(టీఎస్ఎస్పీ), ఇమ్రాన్(ఫైర్), బురుగు కిరణ్(ఏఆర్), వరిమడ్ల శివ(ఏఆర్), చేడ్వాయి గ్రామానికి చెందిన బోయిరే చక్రవర్తి(ఏఆర్), కోసరి బండన్న(సివిల్) కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

కోటపల్లిలో..



కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామానికి చెందిన కొప్పుల మధునయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడు వెంకటేష్ టీఎస్ఎష్పీ కానిస్టేబుల్‌గా ఎంపియ్యాడు.

ఉద్యోగం చేస్తూనే..

మండల కేంద్రానికి చెందిన కాశెట్టి తిరుపతి, విజయ దంపతుల కుమారుడు శ్రీనివాస్ 2018లో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది మంచిర్యాల జిల్లా గుడిపేట బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతోనే సన్నద్ధమై ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఎస్సై కావాలనే లక్ష్యంతోనే చదువుతున్నట్లు శ్రీనివాస్ తెలిపాడు.

–కాశెట్టి శ్రీనివాస్, ఏఆర్ కానిస్టేబుల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ..



దండేపల్లి: మాది దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామం. నేను బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదివాను. ప్రస్తుతం చెన్నయ్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ప్రభుత్వ కొలువు సాధించాలనే తపనతో మొదటి ప్రయత్నంగా ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేశాను. రెండు మార్కుల్లో ఎస్సై మిస్సైంది. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఎస్సై ఉద్యోగం సాధించి తీరుతా.

–కాంద్రపు సోనియా, వెల్గనూర్

రెండో ప్రయత్నంలో..



దండేపల్లి: దండేపల్లికి చెందిన నేను గతంలో పోలీస్ ఉద్యోగ ప్రయత్నం చేశాను. టీఎస్ఎస్‌పీ ఒక్క మార్కుతో మిస్ అయ్యాను. ఏమాత్రం దిగులు పడలేదు. రెండో ప్రయత్నంలో పట్టుదలతో శ్రమించాను. ఎస్సై, పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ రాగానే నిత్య సాధన చేస్తూ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాను. ఈసారి టీఎస్ఎస్‌పీ ఉద్యోగం సాధించాను. ఎస్సై సాధించడమే నా లక్ష్యం.

–దుంపటి వినయ్‌కుమార్, దండేపల్లి

మూడోసారికి..



దండేపల్లి: దండేపల్లికి చెందిన నేను ఇప్పటికీ మూడు సార్లు పోలీస్ ఉద్యోగాలకు ప్రయత్నాలు చేశాను. 2016, 2018లో రెండు సార్లు ప్రయత్నాలు చేశాను. రెండో ప్రయత్నంలో అర మార్కులో మిస్ అయ్యింది. మూడో ప్రయత్నంలో తప్పనిసరి ఉద్యోగం సాధించాలనే తపనతో నోటిఫికేషన్‌కు ముందు నుంచే నిత్య సాధన చేశాను. మూడో ప్రయత్నంలో ఎస్‌ఫీఎఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాను.

–బొలిశెట్టి మహేందర్, దండేపల్లి

హోంగార్డు నుంచి సివిల్ కానిస్టేబుల్‌గా..



దండేపల్లి: 2012లో హోంగార్డు ఉద్యోగంలో చేరాను. కానిస్టేబుల్ ఉద్యోగానికి వయస్సు అర్హత ఉండడంతో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలనే శిక్షణ తీసుకున్నాను. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

–కుదిరె మహేష్, ముత్యంపేట

సత్తా చాటిన శిశుమందిర్ విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు పోలీసు ఉద్యోగాల ఫలితాల్లో సత్తా చాటారు. ఐదుగురు బచ్చు సాయికిరణ్, బుద్దారపు దీక్షిత, తోట శ్రీనివాస్, కొప్పుల వెంకటేష్, దాసరి వినోద్ ఉద్యోగాలు సాధించారు.

స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య


మోహన్‌యాదవ్(ఫైల్)

జైపూర్: వారిద్దరూ ప్రాణ స్నేహితులు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు. ఓ స్నేహితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా మరో స్నేహితుడి జీర్ణించుకోలేక మూడు రోజుల కిందట గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా గురువారం టేకుమట్ల శివారులో మృతదేహం కనిపించింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీరాపూర్ ఆర్కే-8కాలనీకి చెందిన చందనవేని మోహన్‌యాదవ్(27) అదే కాలనీకి చెందిన జీజుల అఖిల్ ఇద్దరూ చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. అఖిల్ తండ్రి ఏడాదిన్న కిందట మరణించడంతో తండ్రి సింగరేణి ఉద్యోగం అఖిల్‌కు వచ్చింది. అఖిల్‌కు ఈ ఏడాది జూన్‌లో వివాహం కాగా ఎప్పటికి బయట స్నేహితులతో తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అఖిల్ ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితుడి మరణ వార్త తెలుసుకున్న మోహన్ మనస్తాపానికి గురై అదే రోజు ఇందారం గోదావరి వద్ద వంతెన పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మోహన్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


శంకరమ్మ(ఫైల్)

భీమారం: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ వివరాల ప్రకారం.. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన దామరకొండ శంకరమ్మ (50) భర్త పర్వతాలు సంవత్సరం క్రితం మరణించాడు. అప్పటి నుంచి ఆమె నర్సింగాపూర్‌లోని స్వంత ఇంటి వద్ద ఒంటరిగా ఉంటుంది. భర్త లేకపోవడంతో పాటు ఉన్న ముగ్గురు కుమారులు దగ్గర లేకపోవడంతో మానసికంగా కృంగిపోయింది. బుధవారం సాయంత్రం ఇంట్లోని పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ప్రబలుతున్న విషజ్వరాలు

- ఒకరి మృతి
- ఇప్పగూడెంలో వైద్య శిబిరం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య లోపం, వాతావరణ మార్పులతో గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పగూడెంకు చెందిన చీకటి వెంకటేష్(30) మూడు రోజుల నుంచి విషజ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేశ్‌కు ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. గ్రామంలోని పలువురికి విషజ్వరాలు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం తాళ్లగురిజాల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 35మందికి రక్త పరీక్షలు చేసి ఐదుగురికి జ్వరం ఉన్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు అనిష్ తెలిపారు.


ఇప్పగూడెంలోని వైద్యశిబిరంలో వైద్యులు

డిస్మిస్ కార్మికుల రీఎంట్రీకి దరఖాస్తులు

శ్రీరాంపూర్: కంపెనీ వ్యాప్తంగా జనవరీ 1, 2019 నుంచి డిసెంబర్ 31, 2022 వరకు అనధికారికంగా గైర్హాజరుతో డిస్మిస్ అయిన వారిని తిరిగి తీసుకోవడానికి కంపెనీ దరఖాస్తులను స్వీకరిస్తుందని శ్రీరాంపూర్ జీఎం బి. సంజీవ రెడ్డి తెలిపారు. ఈ దరఖాస్తులను నిర్ణీత ప్రమాణాల ఆధారంగా హైపవర్ కమిటీచే రివ్యూ చేస్తుందని, దీని ద్వారా తిరిగి ఉద్యోగం పొందే వారు బదిలీ వర్కర్ కేటగిరీ 1గా గుర్తించబడుతారన్నారు. ఈ నిర్ణీతకాలంలో డిస్మిస్ అయిన వారు ఏప్రిల్ 1, 2023 నాటికి 46 సంవత్సరాలు, అంత కంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలన్నారు. డిస్మిస్ అయిన కాలానికి ముందు ఏదేని రెండు సంవత్సరాలు కనీసం 100 మస్టర్లు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులు అక్టోబర్ 31లోగా సంబంధిత మేనేజర్/ఏజెంట్/ఉన్నత అధికారులకు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలను సంబంధిత గనుల సంక్షేమ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

అనారోగ్యంతో నిండు గర్భిణి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: అనారోగ్యంతో నిండు గర్భిణి మృతిచెందిన ఘటన పట్టణంలోని న్యూకాలనీ గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎస్పీఎం ఉద్యోగి సతీష్ సతీమణి మీనా(30) పురుటి నొప్పులతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచనలు మేరకు రెండు రోజుల క్రితం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి పచ్చకామెర్ల వ్యాధి తీవ్రమై చికిత్స పొందుతూ పురుటినొప్పుల్లోనే శిశువు మృతిచెందగా ఆ తర్వాత తల్లి తుదిశ్వాస వదిలింది. మృతురాలికి రెండు సంవత్సరాల పాప ఉంది. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ పరామర్శించారు.

ఈ నెల 6న నామినేషన్

- కంపెనీ వేసిన కేసుపై 11న వాదనలు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ఈ నెల 6న తమ యూనియన్ నామినేషన్ వేయనుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. గురువారం ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. తమతో పాటు బీఎంఎస్ కూడా అదే రోజు నామినేషన్ వేయనుందన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను అడ్డుకోవడానికి మరో మారు యజమాన్యం గురువారం హైకోర్టు ఫుల్ బెంచీని ఆశ్రయించిందని తెలిపారు. సుప్రీంకోర్టు లాయర్లతో ఎన్నికలను అడ్డుకోవడానికి యాజమాన్యం హైకోర్టులో కేసు వేసి నేడు కార్మికులను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. ఈ నెల 7లోగా నామినేషన్ వేయని సంఘాలు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రాములు, శ్రీనివాస్, కుమార్ స్వామి పాల్గొన్నారు.

బాల్క సుమన్‌కు మద్దతుగా తీర్మానం


తీర్మానపత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

చెన్నూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుదని బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం కోర్టు సముదాయంలో నిర్వహించి సమావేశంలో తీర్మాన పత్రాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు న్యాయవాదులు అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం మల్లేశం గౌడ్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ గత చరిత్రను తిరిగి రాస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి, న్యాయవాదులు రమేష్ చందర్‌గిల్డా, కమలామనోహర్‌రావు, మద్ది కార్తీక్, రవీందర్, రమేష్, నిరంజన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో రెడ్డికాలనీకి చెందిన కుర్రా రమాదేవి, జయదేవ్ దంపతులు రూ.2లక్షల విలువ గల వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పింగిలి హరీశ్ చంద్రారెడ్డి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భీష్మ, 24వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్, ఫ్లోర్‌లీడర్ వేములపల్లి సంజీవ్, కమ్మవారి సంక్షేమ సేవ సమితి అధ్యక్షుడు కారసాల మల్లికార్జున్ ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి ముండ్రు జమదగ్ని, కోశాధికారి కంఠమనేని మురళీధర్, కమిటీ సభ్యులు వలేటి శ్రీనివాసరావు, ఓలేటి సతీరామయ్య, సురపనేని అర్జున్‌రావు, మన్నవ భాస్కర్‌రావు పాల్గొన్నారు.